

అర్హులందరికీ రుణమాఫీ : డీఏఓ

వికారాబాద్, ఆగస్టు 29: జిల్లాలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అవుతుందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం వికారాబాద్ మండలంలోని పీరంపల్లి గ్రామంలో మాఫీ కాని కుటుంబసభ్యుల నిర్ధారణకు కొనసాగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో ఎలాంటి సందేహాలున్నా గ్రామాలకు వచ్చే వ్యవసాయాధికారులకు కలిసి తెలుసుకోవాలన్నారు.

క్యాష్ కారులో పెట్టేయమ్మా... !!

» రూ.లక్ష లంచం తీసుకుని ఏసీబీకి చిక్కిన అసిస్టెంట్ రిజిస్ట్రార్



అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస రాజు

మేడ్చల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ దాడులు ఎక్కువయ్యాయి.. ఆ రూ.లక్ష పార్కింగ్ ప్లేస్‌లో ఉన్న నా కారులో పెట్టేయంటూ.. లంచం తీసుకోవడంలో అతి తెలివి ప్రదర్శించిన ఓ ప్రభుత్వ ఉద్యోగి అవినీతి నిరోధక శాఖకు దొరికిపోయాడు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ బీ శ్రీనివాసరాజు రూ.లక్ష లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీకి చిక్కారు. ఏసీబీ సిటీ రేంజ్-2 డీఎస్పీ శ్రీధర్ కథనం ప్రకారం.. నవభారత్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ కేసులో తనకు సహకరించాలని కోరుతూ ఓ వ్యక్తి(ఫిర్యాదుదారుడు) అసిస్టెంట్ రిజిస్ట్రార్(ఆర్బిట్రేటర్) శ్రీనివాసరాజును జూలై 24న కలిశాడు. ఇందుకు శ్రీనివాసరాజు రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేయగా సదరు వ్యక్తి ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ సూచన మేరకు శ్రీనివాసరాజుతో మాట్లాడిన ఫిర్యాదుదారుడు రూ.లక్ష తీసుకుని పని చేయాలని ఒప్పించాడు. ఇందుకు అంగీకరించిన శ్రీనివాసరాజు గురువారం తన కార్యాలయానికి డబ్బు తెచ్చి ఇవ్వాలని సూచించాడు. ఈ మేరకు ఫిర్యాదుదారుడు డబ్బుతో కలెక్టరేట్‌కు రాగా భవనం పార్కింగ్‌లో ఉన్న తన కారు డ్యాష్ బోర్డులో డబ్బు పెట్టాలని శ్రీనివాసరాజు సూచించాడు. ఫిర్యాదుదారుడు పార్కింగ్ ప్రదేశానికి వెళ్లగానే భవనం రెండో అంతస్తు నుంచి శ్రీనివాసరాజు తన కారును అన్‌లాక్ చేశాడు. దీంతో లంచం డబ్బును కారులో పెట్టిన ఫిర్యాదుదారుడు.. ఏసీబీ అధికారులతో కలిసి శ్రీనివాసరాజు వద్దకు వచ్చాడు. వెంటనే శ్రీనివాసరాజును అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు విచారణ చేపట్టి రిమాండ్‌కు తరలించారు.

చెక్‌డ్యాంలపై పట్టింపేదీ?

కూలుతున్న సైడ్‌వాల్స్, పనిచేయని షెటర్లు



షెటర్ లేకపోవడంతో వృథాగా పోతున్న నీరు

భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చెక్ డ్యాంలపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో ఎక్కడికక్కడ శిథిలమైపోతున్నాయి. నీటిని నిలిపే షెటర్లు పనిచేయక పోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షపు నీరు నిలువకుండా వృథాగా వెళ్లిపోతోంది. అలాగే సైడ్ వాల్స్‌కు మరమ్మతులు చేయక పోవడంతో కూలిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

» వృథాగా వెళ్తున్న వరదనీరు
» అధ్వానంగా గోనూరు జుంటివాగు చెక్‌డ్యాం
» కూలిన చెక్‌డ్యాం సైడ్‌వాల్
» పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
» మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న రైతులు

తాండూరు రూరల్, ఆగస్టు 29 : భూగర్భ జలాలు పెంపొందించడంతో పాటు, వర్షం నీటిని ఒడిసి పట్టేందుకు ప్రభుత్వం చెక్ డ్యాంలు నిర్మిస్తున్నా, వాటిపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. తాండూరు మండల పరిధిలోని గోనూరు శివారులోని జుంటివాగు చెక్ డ్యాం నుంచి సాగునీరు వృథాగా పోతోంది. ఇటీవల కురిసిన వానలకు వర్షపు నీరు చెక్‌డ్యాంలో నిల్వ లేకుండా



కూలిపోయిన జుంటివాగు చెక్‌డ్యాం సైడ్‌వాల్

వృథాగా పోతోంది. చెక్‌డ్యాం తూముకు షెటర్ లేకపోవడంతో నీరంతా కిందికి పోతోంది. మరోపక్క చెక్ డ్యాం గోడ శిథిలావస్థకు చేరడంతో అది కూడా కూలిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో నీరు నిలిచే అవకాశం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ కింద ఈ చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.40లక్షల మంజూరు చేసింది. అయితే అప్పట్లో ఇరిగేషన్ అధికారులు నామమాత్రంగా పనులు చేసి బిల్లులు తీసుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పనుల్లో నాణ్యత లేకపోవడంతో చెక్‌డ్యాం సైడ్‌వాల్ పూర్తిగా కూలిపోతుంది. ఇప్పటికైనా కలెక్టర్‌తో పాటు జిల్లా నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు స్పందించి చెక్‌డ్యాం మరమ్మతుకు నిధులు కేటాయించి త్వరగా పనులు పూర్తి చేయాలని కోరుకుంటున్నారు.

వెంటనే మరమ్మతులు చేయాలి



గోనూరు శివారులోని జుంటివాగు చెక్‌డ్యాం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో కురిసిన వర్షం నీరంతా వృథాగా పోతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెక్‌డ్యాం సైడ్‌వాల్ మరింత కూలిపోయింది. పూర్తిగా కూలితే వరదనీటితో పంటలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. చెక్‌డ్యాంల మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు చేయాలి.

- గోవింద్, గోనూరు మాజీ సర్పంచ్



పరిగిలోని ఇండోర్ స్టేడియంలో విద్యార్థులతో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

» స్టేడియాన్ని సద్వినియోగం చేసుకోవాలి » వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి, ఆగస్టు 29: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. భారతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ క్రీడా ఉత్సవాల్లో భాగంగా గురువారం పరిగిలోని ఇండోర్ స్టేడియంలో ఆటల పోటీలను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదో ఒక ఆటను ఎంచుకుని అందులో ప్రతిభను చాటాలని సూచించారు. క్రీడల వల్ల శారీరక ప్రయోజనాలతోపాటు, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యతోపాటు క్రీడల్లో కూడా పాల్గొనేలా విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. విద్యార్థులు, యువత క్రీడలను సాధన చేసేందుకు పరిగి స్టేడియంను సద్వినియోగం చేసుకునేందుకు కల్పించాలని స్థానిక అధికారులకు ఆదేశించారు.

మా వంతు సాయం అందిస్తాం : ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు, క్రీడల్లో అవకాశాలు కల్పించేందుకు విద్యార్థులను, యువతను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వివిధ రంగాల క్రీడల్లో గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. పరిగి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పేరుప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. ప్రతిభ గల క్రీడాకారులకు తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో హన్మంతరావు, మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, తహసీల్దార్ ఆనంద్‌రావు, కమిషనర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల వివరాలు తెలియజేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఆగస్టు 29: మండలాల్లోని ఓటర్ల వివరాలు వెంటనే తెలియజేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 20 మండలాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల గణన వారీగా ఓటరు లిస్టు, మహిళలు, పురుషులు ఎన్ని ఓట్లు ఉన్నాయని వివరాలు ఫిజికల్ వెరిఫికేషన్ చేసి జాబితా ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, ఇన్‌చార్జి డీపీవో సంధ్యారాణి, డీఎల్‌పీవో తాండూరు శంకర్ నాయక్ సంబంధిత అధికారులుతదితరులు పాల్గొన్నారు.

పోస్టుమార్టం ఇక్కడే చేయండి

» రెండేళ్లుగా మేడ్చల్‌లో నిలిచిన శవ పరీక్షలు
» నగరంలోని గాంధీ ఆస్పత్రికి మృతదేహాల తరలింపు
» ఆలస్యమవుతున్న అంత్యక్రియలు
» ఆందోళనలో బాధిత కుటుంబాలు
» పునరుద్ధరించాలని స్థానికుల డిమాండ్



పోస్టుమార్టం రూమ్‌ను తొలగించి నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 29 : రెండేళ్లుగా మేడ్చల్‌లో శవ పరీక్షలు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా మృతి చెందితే పోస్టుమార్టం నిర్వహించటానికి నగరంలోని గాంధీ ఆసుపత్రికి మృతదేహాలను తరలిస్తున్నందున తీసుకెళ్లిన మృతదేహం తిరిగొచ్చేంత వరకు బాధిత కుటుంబాలు ఇంటి ఎదుట నెగడు(మంట) పెట్టుకుని ఎదురు చూడాల్సిన దుస్థితి. 25 సంవత్సరాలుగా మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన పోస్టుమార్టంలను ఒక్కసారిగా నిలిపివేయడంతో మృతుల కుటుంబ సభ్యులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలస్యంగా అంత్యక్రియలు

మేడ్చల్ పట్టణంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద ఉన్న పోస్టుమార్టం రూమ్‌ను రెండేళ్ల క్రితం అధికారులు తొలగించారు. అప్పటి నుంచి శవ పరీక్షలు నిర్వహించ తలచిన మృతదేహాలను గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలిస్తున్నారు. స్థానికంగా పోస్టు మార్టంలు జరపాలని స్థానికులు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతులు సమర్పించినా స్పందించే నాథుడు కరువయ్యాడు. రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతుండటంతో మృతి చెందిన వారి దేహాలను పోస్టు మార్టం చేయించి వారి బంధువులకు అప్పగించటం పోలీసులకు పెద్ద టాస్కుగా మారింది. అలాగే మృతుల కుటుంబ సభ్యులకు మృతదేహాలు త్వరగా అందించకపోవడంతో అంత్యక్రియలు సమయానికి జరుపుకోలేని దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారు.

గాంధీ ఆస్పత్రిలో కాలయాపన

గాంధీ మార్చురీలో జరుగుతున్న కాలయాపన కారణంగా రెండు మూడు రోజుల వరకు కూడా వేచి అంత్యక్రియలు జరిపిన దాఖలాలున్నాయి. ప్రస్తుతం మేడ్చల్ పోలీస్టేషన్ పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వారానికి కనీసం రెండు మృతదేహాలను గాంధీకి తరలిస్తున్నట్లు పోలీసుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. గాంధీ మార్చురీకి తరులుతున్న మృతదేహాలకు సకాలంలో పోస్టుమార్టం జరపకపోవడంతో వారి కుటుంబ సభ్యులు గాంధీ మార్చురీ వద్ద రోదిస్తూ సమయం గడుపుతున్నారు. కుటుంబ సభ్యులు పోయిన బాధ ఒక వంతైతే... శవం అప్పగింత కోసం ఎదురుచూడటం మరో బాధగా మారిందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్థానికంగానే శవపరీక్షలు నిర్వహించాలి



మృతదేహాలకు స్థానిక ఆస్పత్రిలోనే పోస్టుమార్టం నిర్వహించాలి. గాంధీ ఆస్పత్రికి తరలిస్తున్న శవాలు రెండు రోజుల వరకు వారి బంధువులను అప్పగించని దయనీయ స్థితి నెలకొంది. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో యథావిధిగా పోస్టు మార్టంలు నిర్వహించే విధంగా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలి.

-నడి కొప్పు నాగరాజు, మేడ్చల్ పట్టణవాసి

కలెక్టరేట్‌లో క్రీడాపోటీలు

మేడ్చల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను జిల్లా అధికారి చంద్రవతి, ఏఓ రామ్‌మోహన్, రెవెన్యూ అధికారి హరిప్రియ ప్రారంభించారు. రన్ అండ్ వాక్, లెమన్ అండ్ స్పూన్, షాట్ పుట్, త్రోబాల్, చెస్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కార్యాలయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ కనపరిచారు.



చెస్ ఆడుతున్న కలెక్టరేట్ సిబ్బంది




ఫెలోషిప్ వర్క్‌షాప్‌లో మంత్రి సీతక్క

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

కీసర, ఆగస్టు 29: మహిళలు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సూచించారు. గురువారం రంగారెడ్డి జిల్లా కీసర మండల పరిధిలోని రాంపల్లి దాయర బాల వికాస కేంద్రంలో తెలంగాణ ఇందిరా ఫెలోషిప్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. సమాజంలో వస్తున్న మార్పులకు, సామాజిక ప్రభావం కోసం ఆచరణాత్మక నైపుణ్యతతో మహిళలు ముందుకు సాగినపుడే సాధికారిత సాధ్యమవుతుందని సీతక్క తెలిపారు. మహిళలు వైవిధ్యమైన నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారని, నిర్దిష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి గోదాసు పృథ్వీ, నాయకురాలు సౌజన్య, యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ వంగాల వెంకన్న పాల్గొన్నారు.



సెప్టెంబర్ 2న బ్రహ్మాండమైన విడుదల



చెడు అలవాట్లకు గురికావద్దు


విజేతలకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న ఏసీపీ రాములు

శామీర్‌పేట, ఆగస్టు 29: యువత చెడు అలవాట్లకు గురికావద్దని పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు పిలుపునిచ్చారు.మండలంలోని తుర్కపల్లి సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్‌లో కమ్యూనిటీ పోలీసింగ్ తుర్కపల్లి జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీ బాల్ పోటీలను ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్‌తో కలిసి ఏసీపీ గురువారం ప్రారంభించారు. యువత చెడు అలవాట్లను వదిలిపెట్టి గొప్ప ఆశయంతో ముందుకెళ్లాలని సూచించారు. క్రీడల్లో రాణించాలని సూచించారు. తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిక కావద్దన్నారు. క్రీడల్లో నిత్యం శిక్షణ పొంది క్రీడాపోటీల్లో పాల్గొని జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో రికార్డులు నెలకొల్పాలన్నారు.కాగా ఈ వాలీబాల్ క్రీడా పోటీల్లో శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి, లాల్‌గడి మలక్‌పేట, కొల్తూర్ పరిధి లోని యువత, జీనోమ్‌వ్యాలీ పోలీసుల టీమ్‌లు కలసి తొమ్మిది టీములుగా వాలీబాల్ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతి తుర్కపల్లి ఏటీమ్ గెలుపొందగా, లాల్‌గడి మలకోపేట టీమ్ ద్వితీ, జీనోమ్‌వ్యాలీ పోలీసుల టీమ్ తృతీయ బహుమతులు సాధించాయి. ఈ టీమ్‌లకు సాయంత్రం ఏసీపీ రాములు ప్రోత్సాహక బహుమతులతో పాటు ట్రోఫీలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ వైఎస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, తుర్కపల్లి గ్రామస్తులు తిరుపతి రెడ్డి, యూసుఫ్ ఎబాబా, జీనోమ్‌వ్యాలీ పోలీసులు పాల్గొన్నారు.





మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు


ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు, ఆగస్టు 29: మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. తాండూరు పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థల ప్రిన్సిపల్‌తో గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ నియమ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. తాండూరులో మైనర్లు అధికంగా డ్రైవింగ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై మైనర్లు వాహనాలు నడుపుతూ కనిపిస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలపై మాదక ద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో తాండూరు అర్బన్ సీఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి


టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశమైన ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, ఆగస్టు 29: 2019-20 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరంలలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో విశ్వప్రసాద్ అధ్యక్షతన ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎండిన మొక్కల స్థానంలో తిరిగి మొక్కలు నాటాలని తెలిపారు. నర్సరీల్లో ప్రైమరీ షెడ్లను నిర్వహించాలన్నారు. వీటిలో సర్వే మేరకు నర్సరీలో గ్రేడింగ్, షిఫ్టింగ్, కలుపు నివారణ చర్యలు చపట్టాలన్నారు. మొక్కల వివరాలను పీఎస్ సహాయంతో మొక్కలు అందించాలన్నారు. నర్సరీల్లో మిగిలిన మొక్కలు, ఇతర వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు.అవసరమైన పని గుర్తింపు సంఖ్యకు వాచర్‌ను నియామకం చేయడానికి వాచర్, పేరు, జాబ్ కార్డు నెంబర్, మొబైల్ నెంబర్, కేటాయించిన పని గుర్తింపు సంఖ్య, మొక్కలు, లోకేషన్ వివరాలను టెక్నికల్ అసిస్టెంట్ తన క్లస్టర్‌కు సంబంధించిన వివరాలను కార్యాలయంలో అందించాలన్నారు. ఈ సమావేశంలో టీఏ, ఎఫ్ఏ లు మధు, జావెద్, చంద్రయ్య, బాలయ్య, సాయి ప్రసాద్, చిన్న కాజిలప్ప, ఎల్లప్ప, శ్రీనివాస్, మంగమ్మ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

జేఎన్టీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఆశారాణి


అతిథికి జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల చైర్మన్ రమణారెడ్డి

ఘట్‌కేసర్, ఆగస్టు 29: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని విద్యలో రాణించేందుకు నిరంతరం శ్రమించాలని జేఎన్టీయూ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆశారాణి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్‌లో గల సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ ఫస్టియర్ విద్యార్థుల ఓరియెంటేషన్ కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు మొదటి నుంచి చదువుపై దృష్టి సారిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. బీటెక్ జీవితంలో కెరీర్‌కు మార్గం కావాలని ఆదిశగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. సమయం చాలా విలువైందని దాన్ని సద్వినియోగం చేసుకోవడానికి నిరంతరం పుస్తకాలతో కుస్తీపట్టాలన్నారు. వ్యసనాలకు, అల్లరి పనులకు దూరంగా ఉంటూ లక్ష్యసాధనకు ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఏవీ రమణారెడ్డి, ఏడీఆర్‌ఐఎన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నోవాలిన్ జాకబ్, ప్రముఖ మోటివేటర్ అభిషేక్ సింగంశెట్టి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నీలంసింగ్, విద్యాసంస్థల సలహాదారు డాక్టర్ భాగ్యరాజ్, డైరెక్టర్ డాక్టర్ మల్లాడి రమాకాంత్‌రెడ్డి, డాక్టర్ ఎం.రాజేశ్వర్‌రెడ్డి, ఆయా విభాగాల డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





రైతుల సంక్షేమానికి కృషి చేద్దాం: మాధవరెడ్డి


పాలకవర్గంతో మాట్లాడుతున్న మాధవరెడ్డి

బషీరాబాద్, ఆగస్టు 29: రైతుల సంక్షేమానికి పాలక వర్గమంతా కలిసికట్టుగా కృషి చేద్దామని బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.మాధవరెడ్డి అన్నారు. బషీరాబాద్‌లోని ఏఎంసీ కార్యాలయంలో గురువారంతొలిసారి పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మార్కెట్ అభివృద్ధికి, పలు అంశాలపై కార్యవర్గంతో చర్చిస్తూ తీర్మానాలు చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో మార్కెట్ కమిటీకి పక్కభవనం, షెడ్ వద్ద ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేసుకుందామన్నారు. మార్కెట్‌కు ఆదాయ వనరులు లేకపోవడంతో ఇబ్బందులు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.అందరి సహకారంతో మున్ముందు స్థానికంగా మార్కెట్ ప్రారంభించి వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్ల క్రయవిక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మూడవత్ చందర్, పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, పాలకవర్గం సభ్యులు వడ్డే హన్మంతు, అనుప్‌ప్రసాద్, ఎన్.నరేష్, కె.మహేందర్‌రెడ్డి, ఎస్.వనమాల, మునీర్, వి.కె.వెంటప్ప, ఎ.సత్తయ్య, కె.నరేష్, నరేష్‌రథోడ్, ఈ. పాండురంగ, కార్యదర్శి లక్ష్మణ్, సూపర్‌వైజర్ రాములు, సిబ్బంది శివ తదితరులు పాలల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో సుజాత

ముగిసిన జోనల్‌స్థాయి క్రికెట్ టోర్నీ

కడ్తాల్, ఆగస్టు 29 : కడ్తాల్ సమీపంలోని బటర్ ఫ్లై క్రికెట్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జోనల్ స్థాయి ఫ్రీడమ్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల్, తలకొండపల్లి మండల్లోని 20జట్లకు చెందిన 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. టోర్నీ ఫైనల్‌లో పడకల్ జడ్పీ పాఠశాల, మైసిగండి ఆశ్రమ పాఠశాల టీంలు తలపడ్డాయి. పడకల్ విన్నర్‌గా, మైసిగండి పాఠశాల రన్నర్స్‌గా నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి ఎంపీడీవో సుజాత హాజరై క్రీడాకార్యదర్శి భీముడుతో బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి పోటీలకు టీంను ఎంపిక చేశారు. విద్యార్థులు చిన్నప్పటి దశ నుంచే క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు సాబెర్, జ్యోతి, రాధ, మంజుల, బటర్ ఫ్లై స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవ్ నాంపల్లి, టీచర్లు పాల్గొన్నారు.



మట్టి వినాయక ప్రతిమలతో ప్రిన్సిపాల్ తదితరులు

పర్యావరణ పరిరక్షణకు
ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 29 : పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్ బి.నాగేశ్వర్‌రావు అన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం 'మట్టి గణపతి మహాగణపతి' కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు భూమిపై 33శాతం అడవులు ఉండాలని సూచించారు. గాలి, నీరు కలుషితం బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించుకోవాలని సూచించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రాధిక, వైస్‌ప్రిన్సిపాల్ కె.సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎ.రచన, ఎస్.రమేష్, అకడమిక్ కో-ఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి, న్యాక్ కో-ఆర్డినేటర్ శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠ వేడుకలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆధ్యాత్మికతతో ఆనందమయ జీవనం

కడ్తాల్, ఆగస్టు 29: ప్రతీ మనిషి ఆధ్యాత్మికతను అలవర్చుకుంటే ఆనందమయ జీవనాన్ని గడపొచ్చని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. కడ్తాలలోని సాయి మందిరంలో రెండు రోజులుగా కొనసాగుతున్న లలితాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో గురువారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివా స్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు జి.భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, జహంగీర్ అలీ, శ్రీకాంత్‌రెడ్డిలతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. సరస్వతిదేవి ఉపాసకులు లక్ష్మీనారాయణ భాగవతార్ నిర్వహించిన లలితాదేవి కల్యాణం, హరికథ కాలక్షేపం భక్తులను అలరించాయి. ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి, దైవకార్యక్రమాలకు తోడ్పాటునందిస్తుందని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, హన్మనాయక్, జహంగీర్‌బాబ, శేఖర్ గౌడ్, మల్లప్ప, రాజేందర్‌గౌడ్, వెంకటేశ్, లక్ష్మయ్య, కృష్ణ, రాములు, నర్సింహ, శారదమ్మ, కమలమ్మ, విజయమ్మ, గీత, నిర్మలమ్మ, సుమతమ్మ, భారతమ్మ, అర్చకులు వెంకటేశ్వరశర్మ పాల్గొన్నారు.



ఆమనగల్లులో బోనాల ర్యాలీ

ఘనంగా అమ్మోరికి బోనాలు

ఆమనగల్లు, ఆగస్టు 29: అమ్మోరు తల్లి తమను చల్లగా చూడాలని భక్తులు, ప్రజలు దేవతలను వేడుకున్నారు. ఆమనగల్లులో బోనాల వేడుకలకు గురువారం భక్తిశ్రద్ధలతో బోనాలు జరుపుకున్నారు. కుల సంఘాల ఆధ్వర్యంలో పోచమ్మ, పెద్దమ్మ, మడేలుస్వామిల బోనాలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఆలయాలకు చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. కడ్తాల మండలం మక్తమాదారంలో పోచమ్మ, మైసమ్మ బోనాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు సులోచనసాయిలు, మంజులచంద్రమౌళి, అంజయ్య, రమేశ్, మల్లేశ్, యాదయ్య, కృష్ణయ్య, గోపాల్, రాములు, చెన్నయ్య, బాల్‌రాజ్, నర్సింహగౌడ్, పాల్గొన్నారు. అలాగే గట్టిప్పలపల్లి వేడుకల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జయమ్మవెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, నాయకులు

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి

షాబాద్, ఆగస్టు 29: హిందూ ధర్మాన్ని ప్రతీ హిందువు పరిరక్షించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి శ్రీలతరెడ్డి అన్నారు. గురువారం షాబాద్‌లోని స్టార్ గార్డెన్‌లో భజరంగ్‌దళ్ విభాగ్ కోకన్వీనర్ గూడెం రమేష్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భగవద్గీత శ్లోకాల పారాయణం, డ్యాన్స్ పోటీలో శ్రీచైతన్య హైస్కూల్ మొదటి బహుమతి, అక్షర టాలెంట్ స్కూల్ రెండో బహుమతి, కస్తూర్బాగాంధీ, మాంటిస్సోరీ పాఠశాలలు మూడో బహుమతి గెలిచాయి. వారు మాట్లాడుతూ.. ప్రతీ హిందువు ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, ఉపాధ్యక్షులు భోజిరెడ్డి, రంగనాథ్, నాయకులు బర్క కృష్ణ, మద్దూరి పాండు, సోమశేఖర్, రాము, కిరణ్, మాణయ్య, నారాయణ, హరీష్, వినయ్, ధనుష్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గతేడాది పొంగిపొర్లుతున్న లక్నాపూర్ ప్రాజెక్టు(ఫైల్)

నాడు కళకళ... నేడు వెలవెల!



ప్రస్తుతం నీరులేక వెలవెలబోతున్న లక్నాపూర్ ప్రాజెక్టు

పరిగి, ఆగస్టు 29: వానాకాలం సీజన్, వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరుకు చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. జిల్లాలో అక్కడక్కడ చిన్నపాటిగా వర్షాలు కురిసినప్పటికీ పరిగి ప్రాంతంలో మాత్రం కురువలేదు. ఇప్పటివరకు ఏ ప్రాజెక్టులు, చెరువుల్లోకీ నీరు చేరలేదు. కనీసం ఇప్పటి వరకు వాగులు పారేంత వర్షం కూడా కురువలేదు. వాగులు, వంకలు, కుంటలన్నీ బోసిపోయి కనిపిస్తున్నాయి. అక్కడక్కడ ఆడపాదడపా కురుస్తున్న చిన్నపాటి జల్లులతో రైతులను ఆశలు రేకెత్తించినా పెద్దగా ప్రయోజనం చేకూరే వర్షాలు కరవడంలేదు. ముఖ్యంగా పరిగి, దోమ, కులకచర్ల, పూడూరు, చౌడాపూర్ మండలాల్లో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. ఈ ఏడాది అయితే ఏనాడూ పెద్ద వర్షం కురవలేదు. ఈ ప్రాంతానికి పెద్ద దిక్కయిన లక్నాపూర్ ప్రాజెక్టు 20 అడుగుల లోతు ఉండగా, ప్రస్తుతం ఒక అడుగునీరు కూడా ఇప్పటి వరకు చేరలేదు. 2023 ఆగస్టులోనే లక్నాపూర్ ప్రాజెక్టు పొంగి పొర్లింది. గతేడాది ఇప్పటి వరకు 663 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా ఈసారి 273 మి.మీ వర్షపాతం నమోదు కాగా, ఈసారి 273 మీ.మీ వర్షపాతమే నమోదైనట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో పరిగి, దోమ మండలాల్లో సాధారణ వర్షపాతం కురిసినట్లు రికార్డులు చెబుతున్నా ఎక్కడా చుక్కనీరు రాలేదు. గడిసింగాపూర్, ఇబ్రహింపూర్, మిట్టకోడూరు, దోమ, బాసుపల్లి, కిష్టాపూర్, ఐనాపూర్, ముజాహిద్‌పూర్, కులకచర్ల, అంతారం, పుట్టపహాడ్ తదితర చెరువుల్లోకి ఇంకా నీరు చేరలేదు. పంటల సాగుపై కూడా వర్షాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. ముఖ్యంగా వరిపంట సాగు సగాని కంటే ఎక్కువగా తగ్గిపోయిందనే చెప్పవచ్చు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులకు నిధులివ్వండి

▸▸ డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే, రైతుల వినతి



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూర్/శంషాబాద్, ఆగస్టు 29: చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లిలో సాగు, తాగు నీటికోసం తలపెట్టిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులకు నిధులివ్వాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిల ఆధ్వర్యంలో రైతులు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. గురువారం నందిగామ మండలం చేగూర్‌లోని కన్హా శాంతివనంలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న విక్రమార్కకు తిమ్మాపూర్ వద్ద ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌పై రైతులు ఆశలుపెట్టుకున్నారని, ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం సమయం వృథా చేసిందని డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే వివరిస్తూ వినతిపత్రమిచ్చారు. ఇందుకు భట్టి స్పందిస్తూ ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పనులు ప్రారంభిచేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీపీ ఎం.శివశంకర్‌గౌడ్, కొత్తూర్,నందిగామ మండలాల కాంగ్రెస్ నాయకులు హరినాథ్‌రెడ్డి, నర్సింహ, పి.రఘు, ప్రభాకర్, దేవేందర్‌ముదిరాజ్, కుమారస్వామి, చంద్రపాల్‌రెడ్డి, ఉప్పల దయానంద్‌గుప్తా, సిద్ధార్థరెడ్డి, శేఖర్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అలాగే శంషాబాద్ మండలం ఘాన్సిమియగూడ రైతులు తమ భూములకు పట్టా పాసుబుక్కులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మహేందర్ ఆధ్వర్యంలో భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇచ్చారు. చౌదరిగూడ మండలానికి వెళ్తున్న ఆయనను నాయకులు కలిశారు. గ్రామంలోని 3, 4 సర్వే నంబర్లలోని భూములను ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. కొత్త పాస్ బుక్కులు ఇవ్వలేదన్నారు. ఈ భూములను గోల్డ్‌స్టోన్ కంపెనీ తరఫున కొన్నామని ప్రసాద్, పార్థసారథి అనే ఇద్దరు రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. తహసీల్దార్ నాగమణి సర్వే నంబర్ 4లోని కొందరు రైతుల పేర్లను తొలగించారని డిప్యూటీ సీఎంకు విన్నవించారు. రైతులకు పాస్‌బుక్కులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు డి.బాబుయాదవ్, రాములు, భాస్కర్, రవీందర్, పాండు, మల్లేష్ జంగయ్య అంజయ్య, హరిచందర్, మహేందర్ పాల్గొన్నారు.

గౌరారం పరిసరాల్లో సినిమా షూటింగ్



బొంరాస్‌పేట్, ఆగస్టు 29: మండలంలోని గౌరారం గ్రామ పరిసరాల్లో శివ శంభో సినిమా షూటింగ్ గురువారం జరిగింది. మూడు నెలలుగా ఈ సినిమా షూటింగ్‌ను పలు ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నారు. చివరగా గౌరారం గ్రామంలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించినట్లు నిర్మాతలు రాజగోపాల్, దొరవేటి చెన్నయ్య తెలిపారు. షూటింగ్ పూర్తయిందని, ఎడిటింగ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్తీకమాసంలో ఈ సినిమా విడుదల కానున్నట్లు తెలిపారు. ఈ షూటింగ్‌లో హీరోలు సుమన్, ఆజాద్, ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్టులు రంగరాజన్, భవానీ శంకర్, వేణు, బేబి రిషిత, దర్శకుడు ఆర్.నర్సింగ్ పాల్గొన్నారు.

వికారాబాద్‌లో వర్షం

వికారాబాద్, ఆగస్టు 29: పట్టణంలో గురువారం సాయంత్రం కొద్దిపాటి వర్షం కురిసింది. వర్షం కురిసిన ప్రతీసారి వికారాబాద్ పట్టణంలోని ఆయా కాలనీలోని అంతర్గత రోడ్లు నీటితో నిండిపోతుండగా ప్రధాన రోడ్లపైకి సైతం వర్షపునీరు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై అక్కడకక్కడ గుంతలు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

రెండు గ్రామాల్లో
ప్రభుత్వ భూముల సర్వే

కందుకూరు, ఆగస్టు 29: రాష్ట్ర మాజీ మంత్రి టి.హరీష్‌రావు ఆరోపణలతో కందుకూరు మండలం తిమ్మాపూర్, తిమ్మాయపల్లిలోని ప్రభుత్వ భూములను 25రోజులుగా రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. తిమ్మాపూర్‌లోని 38 సర్వే నంబర్‌లోని 350ఎకరాల ప్రభుత్వ భూమిని టీజీఐఐసీ అధికారుల సూచనలతో రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. ఇప్పటికే ఈ భూములపై గత ప్రభుత్వంలో సర్టిఫికెట్లు పొందిన రైతులు కొందరు ఎకరానికి రూ.40లక్షల చొప్పున రియల్టర్లకు విక్రయించారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు సర్వే చేస్తుండడం స్థానికంగా చర్చనీయాంశమైంది. అలాగే తిమ్మాయపల్లిలోని సర్వే నంబర్ 9లో 380ఎకరాల ప్రభుత్వ భూములను సైతం అధికారులు సర్వే చేస్తున్నారు. తిమ్మాపూర్, తిమ్మాయపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ భూములను సర్వే చేస్తుండడంపై స్థానిక నాయకులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం, టీజీఐఐసీ ఏ ఉద్దేశంతో సర్వే చేయిస్తుందోనని ఆందోళనచెందుతున్నారు.

నాపరాతి గనుల్లో అధికారుల క్షేత్రస్థాయి సర్వే


▸▸ ఉన్నతాధికారులకు ఫిర్యాదుతో చర్యలు



ఓగీపూర్ సర్వేనెంబర్-77లో నిర్వహిస్తున్న మైన్స్, రెవెన్యూ అధికారుల బృందం

తాండూరు రూరల్, ఆగస్టు 29: తాండూరు మండలం ఓగీపూర్ గ్రామ శివారులోని నాపరాతి గనుల్లో అక్రమ తవ్వకాలపై ఇటీవల రాష్ట్ర మైన్స్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేశారు. తాండూరు ప్రాంతానికి చెందిన ఎం.వెంకట్‌రాంరెడ్డి కొన్ని రోజుల కిందట తాండూరు మండలం ఓగీపూర్ గ్రామ శివారులోని నాపరాతి గనుల్లో కొందరు అక్రమార్కులు ఫీజులు లేకుండా అక్రమ తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో అట్టి ఫిర్యాదు మేరకు రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ ఆధ్వర్యంలో తాండూరు మైన్స్ శాఖ ఏజీ నాగరాజు, మైన్స్ ఆర్ఐ నిర్మల, సర్వేయర్ అశోక్, రెవెన్యూ శాఖ ఆర్ఐ గోపి, సర్వేయర్ మహేష్‌ల బృందం ఓగీపూర్ గ్రామ శివారులోని సర్వేనెంబర్-64, సర్వేనెంబర్-77లో క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే నిర్వహించారు. ఏ మేరకు తవ్వకాలు జరిపారు? ఆ సర్వేనెంబర్ ఎంత విస్తీర్ణంలో ఉన్నాయనే దానిపై సమగ్ర వివరాలు సేకరించారు. సర్వేనెంబర్-64లో తొమ్మిది ఎకరాల 6 గుంటలు, సర్వే నెంబర్-77లో 14 ఎకరాల 33 గుంటల భూమిలో అక్రమ తవ్వకాలు జరిపారని ఫిర్యాదు మేరకు అధికారుల బృందం శాటిలైట్ సర్వే నిర్వహించారు. సర్వేనెంబర్-77 సమీపంలో వ్యవసాయ భూములు ఉన్నాయని సర్వేలో అధికారులు నిర్ధారించారు. నాపరాతి తవ్వకాలు, సర్వే నెంబర్ విస్తీర్ణం వంటి సమగ్ర వివరాలను సేకరించారు. సర్వేనెంబర్-77లో కొంతమంది తవ్వకాలతోపాటు కంది పంటలు సాగు చేసినట్లు తేలిందని అధికారులు చెప్పారు. వారి వెంట మైన్స్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న కుటుంబసభ్యుల నిర్ధారణ



కుటుంబసభ్యుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్న ఏవో బాసిత్, పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 29: రూ.2లక్షల రైతు రుణమాఫీకి అర్హత ఉన్నా వర్తించని రైతుల ఇంటింటికి వెళ్లి కుటుంబసభ్యుల నిర్ధారణకు మండల వ్యవసాయ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని అవుషాపూర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీతో పాటు పోచారం మున్సిపాలిటీలోని యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడలలో గురువారం వ్యవసాయ అధికారులు ఇంటింటికి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలను సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మండలంలోని వివిధ కమర్షియల్ బ్యాంకుల్లో 123 మందికి రుణమాఫీ వివిధ కారణాల వల్ల కాలేదని, వ్యవసాయశాఖ రూపొందించిన రైతు భరోసా పంట రుణమాఫీ యాప్‌ను అమల్లోకి తీసుకొచ్చినట్లు మండల ఏవో బాసిత్ తెలిపారు. కుటుంబ యజమాని రుణఖాతా, బ్యాంకు వివరాలతో పాటు కుటుంబసభ్యుల వివరాలను, రైతు డిక్లరేషన్ పత్రంలో కుటుంబ యజమాని సంతకం, ఫోన్‌నెంబర్‌ను నమోదు చేసిన తర్వాత యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు 123మందికి గానూ 35 మందికి సంబంధించిన కుటుంబసభ్యుల నిర్ధారణ పూర్తయినట్లు ఏవో తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో కుటుంబసభ్యుల నిర్ధారణ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, ఏఈవో జగదీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఘట్‌కేసర్ రైతుసేవా సహకార సంఘంలో రుణం తీసుకున్న 1230మంది రైతులకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదు. సహకార సంఘంలో రుణం తీసుకున్న వారికి ఆడిట్ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.



బహుమతి అందుకుంటున్న రమ్యశ్రీ

వ్యాసరచన పోటీలో విద్యార్థిని ప్రతిభ

మాడ్గుల, అగస్టు 29: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి సందర్భంగా సికింద్రాబాద్ మచ్చ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో 28, 29 తేదీల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఇర్విన్ జడ్పీ పాఠశాల విద్యార్థిని ఎస్.రమ్యశ్రీ మొదటి బహుమతి సాధించింది. బాలికకు రాష్ట్రపతి నిలయం ఎండీ రజిన్‌ప్రియ బహుమతి అందచేశారు. ఈ సందర్భంగా రమ్యశ్రీని హెచ్ఎం పర్వతాలు, టీచర్లు అభినందించారు. కార్యక్రమంలో టీచర్ కరుణాకర్, విఘ్నేశ్వర్ పాల్గొన్నారు.



బెల్లయ్యనాయక్‌ను సన్మానిస్తున్న రవీందర్‌నాయక్, రాములు

గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


ఆమనగల్లు, ఆగస్టు 29: గిరిజన సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. ప్రభుత్వం గిరిజన పథకాలకు బడ్జెట్‌లో రూ.350కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల్లో గురువారం బెల్లయ్యనాయక్ పర్యటించారు. మైసిగండి మైసమ్మ ఆలయాన్ని, ఆమనగల్లు సేవాలాల్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. తండాల అభివృద్ధికి, సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయించాలని కోరారు. బెల్లయ్య మాట్లాడుతూ.. గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయం అన్నారు. అన్ని తండాలకు బీటీ రోడ్లు వేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందన్నారు. ప్రభుత్వ పథకాలు గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా/మండల నాయకులు రవీందర్ నాయక్, మండ్లీ రాములు, కృష్ణనాయక్, హీరాసింగ్, జవహర్‌లాల్, సురేశ్, శ్రీధర్, అనిల్‌నాయక్, జయరామ్, దశరథ్, రాజుకుమార్, ఫరీద్, కుమార్‌గౌడ్, గోపి, రాకేశ్, తావుర్య సురేశ్, కిషన్, తులసీరామ్ పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను
సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 29: విద్యార్థులు విద్యదశలో వచ్చే ప్రతీ అవకాశన్ని సద్వినియోగం చేసుకుంటేనే ప్రయోజకులవుతారని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో గురువారం విద్యార్థులతో ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. పరిశోధనలకు తమ యూనివర్సిటీ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ విక్రమ్‌రెడ్డి, దామోదర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, వీర వెంకటయ్య, శంకర్ లింగం, కవిత, క్రిస్టొఫర్, సుందర్‌రామ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ప్రభుత్వాలు హామీలను అమలు చేయాలి

కడ్తాల్, ఆగస్టు 29: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గాన్గుమర్ల తండాలో గురువారం కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, వెంకటేశ్, విజితారెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ పథకాలను అమలు చేయకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తిచేయాలన్నారు. కేంద్రం పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్‌కు జాతీయ హోదా కల్పించాలన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాల పెంపు, తండాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. సమావేశంలో ఆనంద్, జోగు వీరయ్య, సేవ్యానాయక్, అంజి, లాయక్‌అలీ పాల్గొన్నారు.

యువకులు, పోలీసుల మధ్య
సత్సంబంధాలు మెరుగుపడాలి



మాట్లాడుతున్న మేడ్చల్ డీసీపీ కోటి రెడ్డి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 29: యువకులు, పోలీసుల మధ్య సత్సంబంధాలు మెరుగుపడాలని మేడ్చల్‌జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్లీ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోలీసులను డీసీపీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు పెడదారి పట్టకుండా వారిలో క్రీడానైపుణ్యం పెంచడానికి ఆటలపోటీలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో యువకులు పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. క్రీడల్లో ఫిట్‌నెస్ పెంచుకోదలచిన యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. మాదకద్రవ్యాలు విక్రయించే వారి ఆట పట్టించడానికి పోలీసులకు సహకరించాలన్నారు. యువకుల్లో చైతన్యం తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో సైబరాబాద్ కమిషనర్ ఆటల పోటీలను నిర్వహించటానికి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను, యువకులను చైతన్య పర్చడానికి పోలీసుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతు న్నామన్నారు. సమాజంలో ఎక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరిగిన యువకులు తమ వంతు బాధ్యతగా స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్ మాఫియా కళాశాల విద్యార్థులను టార్గెట్‌చేసి విక్రయాలు కొనసాగిస్తోందని, ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ క్రీడా పోటీల్లో మండలానికి చెందిన 16 జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరిచిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ సీఐ సత్యనారాయణ, డిటెక్టివ్ సీఐ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బస్టాండ్‌లో దిగబడిన బస్సు



ధారూరు బస్టాండ్‌లో బురదలో దిగబడిన బస్సు

ధారూరు, ఆగస్టు 29: ధారూరు బస్టాండ్‌లో గురువారం తాండూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ డీలక్స్ బస్సు బురదలో దిగబడింది. బస్టాండ్‌లోకి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని తిరిగి వెళ్తున్న క్రమంలో బస్సు చక్రాలు బురదలో దిగబడి ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దీంతో డ్రైవర్ ప్రయాణికులను కిందకు దింపి మరో బస్సులో పంపించాడు. అనంతరం తాండూరు డిపోకు సమాచారం అందించాడు. కాగా వర్షానికి బస్టాండ్‌లో నిలిచిన నీటి మడుగుల్లో మట్టి పోయడంతో చిన్నపాటి వర్షానికే ఆ మట్టి బురుదగామారి బస్సులు దిగబడుతున్నాయని ప్రయాణికులు తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్‌లో ప్రయాణికులకు, బస్సులు నడిపే డ్రైవర్లకు ఇబ్బందులకు కలగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

హాస్టల్ విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలి

● పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఆగస్టు 29: ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల పట్ల వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి సూచించారు. పరిగిలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల సలహా సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హాస్టళ్లలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత వార్డెన్లదేనన్నారు. వసతిగృహాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే రాతపూర్వకంగా తనకు అందజేయాలని వార్డెన్లకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, ఏం జరిగినా వార్డెన్‌లే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, బీసీ సంక్షేమ జిల్లా అధికారి ఉపేందర్, తహసీల్దార్ ఆనంద్‌రావు, వివిధ హాస్టళ్ల వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

పరిగి: కులకచర్ల మండలం రాంరెడ్డిపల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకులు గురువారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అనమోని నర్సింహులు, బుగ్గయ్య, కుమ్మరి నర్సింహులు, మల్లేశ్, బంగారి రాజు, వడ్డే భీమయ్య తదితరులు 30 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, న్యాయవాది నర్సింహులుయాదవ్, లక్ష్మయ్య గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కటికె చెన్నయ్య, కుమ్మరి రమేశ్, రాములుగౌడ్, కృష్ణయ్య, యాదయ్య, అంబోజిరావు, శ్రీనివాస్ ఆశయ్యలు ఉన్నారు.

కులకచర్ల: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. చౌడాపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం 21 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభుల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



డీఎస్పీ కార్యాలయం ఎదుట చింతలపల్లి గ్రామస్తుల నిరసన

పరిగి, ఆగస్టు 29: దళితుడిని సామాజికవర్గం పేరుతో దూషించి, ఆపై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని కేవీపీఎస్, అంబేడ్కర్ సంఘాలు డిమాండ్ చేశాయి. పరిగిలోని డీఎస్పీ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.మహిపాల్ మాట్లాడుతూ.. పూడూరు మండలం చింతపల్లి గ్రామంలో ఈనెల 18న ఎం.ప్రవీణ్ పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా, గ్రామానికి చెందిన అగ్రకులస్తులు అడ్డుపడి పాత కేసులో రాజీకావాలని, లేదంటే చంపేస్తామని బెదిరించారని తెలిపారు. దుర్భాషలాడుతూ కర్రలతో కొట్టి తీవ్రంగా హింసించారని తెలిపారు. పీఎస్‌లో ఫిర్యాదు చేసి 12రోజులు గడుస్తున్నా కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. దళితుడిపై దాడి చేసిన నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చన్‌గోముల్ ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి కూడా అగ్రకులస్తులకే వత్తాసు పలుకుతున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాజు, యాదయ్య, రాములు, సదానందం, బుచ్చయ్య, చిన్నయ్య, యాదయ్య, సాయికుమార్, వెంకటయ్య, రాఘవేందర్, రవి, దీలీప్ ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా



క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవంలో కుటుంబసభ్యులతో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, ఆగస్టు 29: ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, తాండూరు ప్రజల ప్రేమ, అభిమానం మరువలేనివని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. తాండూరు పట్టణంలోని రోహిత్‌రెడ్డి నివాసం పక్కన నూతనంగా నిర్మించిన క్యాంప్ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఇబ్బందులు కలుగకుండా క్యాంప్ కార్యాలయం నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి, కౌన్సిలర్ సంగీత ఠాకూర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు అనురాధ, సాయిపూర్ నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌చారి, రవీందర్‌రెడ్డి, నయీం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

కొడంగల్, ఆగస్టు 29: తెలుగు భాషా దినోత్సవాన్ని కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ పాఠశాలలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డివి.నరేశ్‌రాజ్ గిడుగు రామ్మూర్తి జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. అదే విధంగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జీవిత చరిత్రను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకుడు వెంకటయ్యను ప్రిన్సిపాల్, అధ్యాపకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేశ్‌స్వామి, అధ్యాపకులు రమేశ్, శ్రీనాథ్, వెంకటయ్య, ఉషారాణి పాల్గొన్నారు.

శామీర్‌పేట: శామీర్‌పేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల్లో తెలుగు శాఖ ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాష దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చేతన, తెలుగు అధ్యాపకులు డాక్టర్ వి.హర్షిత, వి.మేఘస్రవంతి పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

పెద్దేముల్, ఆగస్టు 29: హాకీ మాంత్రికుడుగా ప్రపంచఖ్యాతిని గడించిన క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ను క్రీడాకారులందరూ ఆదర్శంగా తీసుకోవాలని రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ గౌరిశంకర్ అన్నారు. పెద్దేముల్ మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ గౌరిశంకర్, కందనెల్లి పీడీ రాధాకృష్ణ, ఇందూరు పీడీ గోపాల్‌లను స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

బంట్వారం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గురువారం ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల ప్రాధాన్యతను వివరించారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడిని తిరిగి నియమించాలి

బషీరాబాద్, ఆగస్టు 29: పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడిని తిరిగి ఇక్కడే నియమించాని బమంతన్‌గౌడ్‌తండా వాసులు జిల్లా కలెక్టర్, విద్యాధికారిని గురువారం కలిసి విన్నవించారు. పాత ఉపాధ్యాయుడు శేశగిరి ఇక్కడి నుంచి వెళ్లిపోవడంతో తమ పిల్లలు సరిగా పాఠశాలకు వెళ్లడం లేదని, ఆ ఉపాధ్యాయుడే కావాలని పట్టుబడుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. ఈ సమస్యను పరిశీలిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తండావాసులు తెలిపారు.

బీటీ రోడ్డు నిర్మించాలి

బొంరాస్‌పేట్, ఆగస్టు 29: మండలంలోని కొత్తూర్ నుంచి దేవనూర్ వరకు బీటీ రోడ్డు అధ్వానంగా మారిందని, 20 సంవత్సరాలుగా ప్రజలు నరకయాతన పడుతున్నారని దళిత ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. గతంలో రవాణా శాఖ మంత్రిగా ఉన్న మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చినా అమలు చేయకపోవడంతో గురువారం రోడ్డు నిర్మాణం చేపట్టాలని కొత్తూర్ నుంచి తాండూర్ వరకు పాదయాత్రగా వెళ్లి మహేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లి సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు డాక్యానాయక్, బాలప్ప, మోహన్, రాంచంద్రయ్య, చంద్రయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం

ఘట్‌కేసర్, ఆగస్టు 29: సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కార్మికుల సంక్షేమం కోసమే పనిచేస్తుందని ఆసంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్ రావు అన్నారు. గురువారం సికింద్రాబాద్ రైల్ నిలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఘట్‌కేసర్‌తోపాటు వివిద విభాగాలకు చెందిన రైల్వే కార్మికులు, ఆయా సంఘాలకు చెందిన నాయకులు మజ్దూర్ యూనియన్‌లో చేరినట్లు సంఘం నాయకులు తెలిపారు. నూతనంగా చేరిన వారిలో ఎం శ్రీకాంత్, విజయ్, కుమార్ రంజన్, సంతోష్‌లు ఉన్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. మజ్దూర్ యూనియన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రవీందర్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, క్రిష్ణ, కిరణ్, అన్నపూర్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 29: మండలంలోని మెడిసిటీ 33బై11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చేపడుతున్న మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

పార్టీ సభ్యత్వ నమోదు అధికంగా చేయించాలి



మేడ్చల్ టౌన్: సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విక్రమ్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 29: బీజేపీ సభ్యత్వ నమోదులు అధికంగా చేయించాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మేడ్చల్ పట్టణంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్ గౌడ్, మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్, నాయకులు సుధాకర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదుపై గురువారం పట్టణ పదాధికారుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్ పాల్గొన్నారు. ప్రతీ పోలింగ్ బూత్‌కు 200 సభ్యత్వ నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేష్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, జిల్లా కార్యదర్శి బండారం భద్రేశ్వర్, అధికారి ప్రతినిధి వెంకట్, కౌన్సిలర్ సాహుశ్రీలత పాల్గొన్నారు.

కీసర రూరల్: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాగారం మున్సిపాలిటీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి బుద్ది శ్రీనివాస్ అన్నారు. నాగారంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమ నిర్వహణపై మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డితో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరే నాయకులు, క్రియా శీల కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, నాయకులు శ్యాంశర్మ, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, బుద్దవరం లక్ష్మి, మున్సిపల్ పార్టీ ప్రెసిడెంట్ వేణు, కిషోర్, సురేష్, బలరాం, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

బీజేపీ పల్లె పలకరింపు

బొంరాస్‌పేట్: మండలంలోని వడిచర్ల, ఏనమీదితండా, కొత్తూర్ గ్రామాల్లో బీజేపీ గ్రామ కమిటీల అధ్యక్షులతో పార్టీ నాయకులు పల్లె పలకరింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన బాబయ్యనాయుడును పార్టీ కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు శాలువాలతో సన్మానించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నర్సింహులుగౌడ్, హనుమంతు, రాములు, వెంకటయ్యగౌడ్, అంజిలయ్య, సాయిలు, వెంకటయ్య బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగురావు, జనార్దన్, మహేందర్‌గౌడ్, జగదీశ్, హరి, శ్రీశైలం, నారాయణగౌడ్, రాజు, ప్రతాప్, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా మొక్కలు నాటాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ మంజులరమేష్, సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, ఆగస్టు 29: ప్రతీ ఒక్కరు తమవంతుగా ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 14, 24, 25, 33 వార్డుల్లో ఇంటింటికి మొక్కలు పంచే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అర్థ సుధాకర్ రెడ్డితో కలిసి ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అర్థ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీదేవి సదానంద్ రెడ్డి, రామస్వామి, నాయకులు సదానంద్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌చార్జి ఎస్ఐ యేసు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: వన మహోత్సవంలో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 4వ, వార్డులో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో కమిషనర్ అజ్మీర స్వామి నాయక్, కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, అమరం సరస్వతి, బీజేపీ నియోజక వర్గం కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కీసర: మండలంలోని రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి మొక్కలు నాటారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్‌బీఐ అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఇందుల్లో భాగంగా పైలెట్ ప్రాజెక్ట్‌గా రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌ను ఎంపిక చేసుకున్నారు. ఈ మేరకు ఆర్‌బీఐ హైద్రాబాద్ ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ కమల్ పి. పట్నాయక్ గురువారం జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు విచ్చేసి, విద్యార్థులు, పాఠశాల బృందంచే 90 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పద్మజా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **తాండూరు రూరల్/కొడంగల్ రూరల్:** బెల్కటూర్ వ్యవసాయ క్లస్టర్ కింద ఎల్మకన్నె, వీరారెడ్డిపల్లి, బెల్కటూర్ తదితర గ్రామాలకు చెందిన రుణమాఫీ కాని అధికారుల వివరాలను సేకరించేందుకు బెల్కటూర్ రైతు వేదికలో వ్యవసాయాధికారి కొమరయ్య ఆధ్వర్యంలో తాండూరు వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి గురువారం కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. అదేవిధంగా దుద్యాల్ మండలంలోని హస్నాబాద్‌లో ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏఈవో గురువారం రుణమాఫీ వర్తించని రైతుల కుటుంబ నిర్ధారణ దరఖాస్తులను పరిశీలించారు.

● **వికారాబాద్:** పట్టణంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

● **కీసర:** కీసరగుట్టలో రామలింగేశ్వరుని కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** బషీరాబాద్‌లోని ఏఎంసీ కార్యాలయంలో చైర్మన్ జి.మాధవరెడ్డి ఆధ్వర్యంలో తొలిసారి పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కార్యవర్గంతో చర్చిస్తూ తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మూడవత్ చందర్, పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్:** సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కార్మికుల సంక్షేమం కోసమే పనిచేస్తుందని ఆసంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు అన్నారు. సికింద్రాబాద్ రైల్ నిలయం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో ఘట్‌కేసర్‌తోపాటు వివిద విభాగాలకు చెందిన రైల్వే కార్మికులు, ఆయా సంఘాలకు చెందిన నాయకులు మజ్దూర్ యూనియన్‌లో చేరినట్లు నాయకులు తెలిపారు.

● **కీసర రూరల్:** గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నాగారం మున్సిపాలిటీ బీజేపీ మహిళా మోర్చా కార్యదర్శి శైలజ జన్మదిన సందర్భంగా గురువారం ఆమె గ్రంథాలయానికి పలు పుస్తకాలను విరాళంగా అందజేసారు.

● **కొడంగల్:** స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవన నిర్మాణ పనులను సూపరింటెండెంట్ చంద్రప్రియ గురువారం పరిశీలించారు.

● **కొడంగల్:** కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని రేగడిమైలారం గ్రామ సమీపంలో వీరశైవ సంఘం సభ్యులు గురువారం బసవేశ్వరుడి విగ్రహాన్ని పున ప్రతిష్ఠించారు. రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి హాజరయ్యారు. సంఘం సభ్యులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో దూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్.జయతీర్థచారి పాల్గొన్నారు.

● **పెద్దేముల్:** మండల కేంద్రంలో గురువారం మండల కుర్వసంఘం సమావేశం నిర్వహించారు. నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా గోపాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఇందూరు బాలు, ప్రధాన కార్యదర్శిగా రాఘవేందర్, సహాయకార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా అనంతయ్యను ఎన్నుకున్నారు.

● **వికారాబాద్:** పట్టణంలోని ఆలంపల్లి ప్రధాన రోడ్డులోని బీజేఆర్‌చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తాతోపాటు ఇతర ప్రధాన కూడలిలలో జరిగిన హైమాస్ట్ లైట్ల మరమ్మతు పనులను మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ గురువారం పర్యవేక్షించారు.

● **ధారూరు:** చింతకుంటలోని పాఠశాలలో గురువారం సాధన, కేఎస్‌సీఎఫ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బాల్య వివాహాల ముక్త భారత్ ప్రతిజ్ఞ చేశారు.

● **దౌల్తాబాద్/దోమ:** దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా దోమ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశంతో పాటు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేశ్‌బాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **బొంరాస్‌పేట్:** దుద్యాల మండలంలోని హకీంపేటలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చాకలి గోపాల్ తల్లి గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి ఆమె అంత్యక్రియలకు రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

క్రైం కార్నర్

యువకుడి దారుణ హత్య



హత్యకు గురైన యువకుడు కళ్యాణ్

మేడ్చల్ టౌన్, ఆగస్టు 29: మేడ్చల్ పట్టణంలో ఓ యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని అమలాపురంనకు చెందిన కళ్యాణ్(27)ను బుధవారం రాత్రి ముగ్గురు యువకులు పట్టణంలోని వినాయక్‌నగర్ రోడ్-2 వద్ద గ్యాస్ పైపులు, పిడిగుద్దులతో దాడికి దిగారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకునేలోపే దాడికి పాల్పడుతున్న ముగ్గురు యువకులు కళ్యాణ్‌ను విఘ్నేశ్వర హాస్టల్ వద్ద వదిలేసి పరారయ్యారు. అపస్మారక స్థితిలో ఉన్న కళ్యాణ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించడానికి 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్ వచ్చేలోపే కళ్యాణ్ ప్రాణాలను వదిలాడు. దీంతో అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. యువకుల మధ్య ఘర్షణకు గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ ఘటనాస్థలానికి చేరుకుని దాడిలో ఉపయోగించిన గ్యాస్ పైప్‌లను స్వాధీనం చేసుకున్నారు. కళ్యాణ్ నాలుగు నెలల కిందట విఘ్నేశ్వర హాస్టల్‌లో ఉండేవాడని, తిగిరి అదే హాస్టల్‌లో ఉండడానికి డబ్బులు చెల్లించడానికి బుధవారం రాగా మొత్తం డబ్బులు చెల్లించకపోవటంతో హాస్టల్ నిర్వాహకులు నిరాకరించినట్లు తెలిసింది. దీంతో తిరిగి మొత్తం డబ్బులు చెల్లించడానికి వస్తుండగా దుండగులు దాడికి పాల్పడినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. యువతుల విషయంలో గొడవపడి ఉండవచ్చని, లేదంటే డబ్బులు ఇచ్చిపుచ్చుకునే వ్యవహారంలో తేడా వచ్చి ఘర్షణపడి ఉండవచ్చనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే స్థానిక హాస్టళ్లలో ఉన్న విద్యార్థులను, ఇతర యువకులను పోలీసులు ఆరాతీస్తున్నారు. మృతుడు స్థానిక పరిశ్రమలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

● కుళ్లిన దశలో మృతదేహం ● నిజామాబాద్ జిల్లా వాసిగా గుర్తింపు

బషీరాబాద్, ఆగస్టు 29: భార్య, భర్తలు తిరుపతికి వెళ్లి రైలులో తిరిగి వస్తుండగా అదృశ్యమైన భర్త అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు ఈ ఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మంతన్‌గౌడ్ గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో గురువారం ఉదయం వెలుగుచూసింది. ఏఎస్ఐ నారాయణ తెలిపిన కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా తొటగిరి మండలం ఏతొండ గ్రామానికి చెందిన రెడ్డి రవి(41), హేమ భార్య, భర్తలు తిరుపతికి వెళ్లి రైలులో ఈనెల 22న తిరిగివస్తున్నారు. ఈ క్రమంలో రైలులోని ఏసీ కోచ్‌లో రెడ్డి రవి మతిస్థిమితం కోల్పోయి ప్రవర్తించినట్లు భార్య హేమ తెలిపింది. నవాంద్గీ రైల్వేస్టేషన్ రాగానే రెడ్డి రవి అదృశ్యమయ్యాడు. దీంతో రైలులో వికారాబాద్ జిల్లా కేంద్రంలో దిగిన భార్య అక్కడి రైల్వేపోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటినుంచి తన భర్త జాడ కోసం నవాంద్గీ(బషీరాబాద్) పరిసరాల్లో బంధువులతో కలిసి వెతికింది. స్థానికంగా కొంతమందికి డబ్బులిచ్చి తన భర్త జాడ వెతికించినట్లు సమాచారం. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. గురువారం ఉదయం మంతన్‌గౌడ్ శివారులోని ఓ బావి వద్ద కుళ్లిపోయిన మృతదేహాన్ని మేకల కాపారికి కనిపించడంతో సమాచారం పోలీసులకు చేరింది. ఏఎస్ఐ నారాయణ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి కనిపించడంతో తాండూరు రూరల్ సీఐ అశోక్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని మిస్సింగ్ కేసుపై అనుమానంతో రెడ్డి హేమను ఘటనా స్థలానికి పిలిపించారు. భర్త ఆనవాళ్లు గుర్తించిన భార్య హేమ పోలీసులకు తన భర్తేనని చెప్పింది. మృతిపై ఎలాంటి అనుమానం లేదని పోలీసులకు భార్య వివరించింది. అనంతరం మృతదేహాన్ని పోలీసులు తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

కళాశాలలో క్షుద్రపూజలు?

● బషీరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఘటన



కళాశాల ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తులు వేసిన కుంకుమ, పసుపు

బషీరాబాద్, ఆగస్టు 29: ఓ ప్రైవేటు కళాశాలలో క్షుద్రపూజలు చేసిన ఘటన గురువారం వెలుగు చూసింది. బషీరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న ఈ క్షుద్రపూజల దృశ్యాన్ని చూసిన లెక్చరర్లు, విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధాన ద్వార ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు కుంకుమ, పసుపు, నిమ్మకాయలు, ఆగరుబత్తులు ఉండటంతో స్వీపర్ నిత్యం క్లీన్ చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఓ పక్క పోలీసులు క్షుద్రపూజలు, మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా అక్కడక్కడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుండటంతో విద్యావంతులు ఆందోళన వ్యక్తం చేశారు.

యువకుడు అదృశ్యం



భానుప్రకాష్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 29: ఉద్యోగం కోసం నగరానికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, చందుపట్లగూడకు చెందిన కంభం భాను సూర్య ప్రకాష్‌రెడ్డి(24) బీటెక్ పూర్తి చేసుకొని రెండేళ్ల నుంచి ఇంటివద్దే ఉంటున్నాడు. రెండు నెలల కిందట నగరానికి వెళ్లి ఉద్యోగం చూసుకుంటానని చెప్పి బైక్, ల్యాప్‌టాప్ తీసుకొని వెళ్లాడు. ఈనెల 25వ తేదీన అర్ధరాత్రి నడుస్తూ ఇంటికి వచ్చాడు. వెంట తీసుకెళ్లిన బైక్, ల్యాప్‌టాప్ ఏమయ్యాయని కుటుంబసభ్యులు అడగగా వాటిని కుదువపెట్టానని, డబ్బులిస్తే తీసుకొస్తానని చెప్పాడు. తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వకపోవడంతో అతడు ఇంట్లో నుంచి వెళ్లిపోయి, ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో తల్లిదండ్రులు ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు



బోల్తాపడిన ఆటో

మర్పల్లి, ఆగస్టు 29: ఆటో బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మర్పల్లి మండలంలోని కొత్లాపూర్ గ్రామ సమీపంలో జరిగింది. మర్పల్లి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏపీ 28 టీవీ 1571 నెంబరు గల ఆటోలో గురువారం సిరిపూరం గ్రామం నుంచి మర్పల్లికి పలువురు వస్తుండగా కొత్లాపూర్ శివారులో కల్వర్టు దగ్గర అతివేగం, అజాగ్రత్త కారణంగా అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అజాగ్రత్తగా వాహనాన్ని నడిపించిన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు మర్పల్లి ఎస్ఐ సురేశ్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందికి జైలుశిక్ష

● మరో 13మందికి జరిమానా

తాండూరు, ఆగస్టు 29: డ్రంకెన్ డ్రైవ్ కేసులో 14మందికి జైలు శిక్ష, మరో 13 మందికి జరిమాన విధిస్తూ న్యాయమూర్తి నామాల అశోక్ గురువారం తీర్పు చెప్పారు. తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 14 మందికి రెండు రోజుల పాటు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. అదే విధంగా మరో 13మందికి రూ.వెయ్యి నుంచి రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలుశిక్ష తప్పదని సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

దౌల్తాబాద్, ఆగస్టు 29: మండల కేంద్రానికి చెందిన మొగులప్ప ఫోన్ పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఇటీవలే ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా సీఈఐఆర్ యాప్ ద్వారా ఫోన్ కేరళలో ఉన్నట్లు గుర్తించారు. అట్టి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని గురువారం బాధితుడికి ఎస్ఐ రవిగౌడ్ అప్పగించారు.

రక్తదానం చేయాలి

ఘట్‌కేసర్, ఆగస్టు 29: ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని ఘట్‌కేసర్ శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.వెంకట్‌రెడ్డి కోరారు. స్థానిక శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ శిబిరంలో 22 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.